# మన ఆచారములు - అంతరార్థములు

## కర్పూరము

కర్పూరము వాసనంటే నాకు చాలా ఇష్టం. కర్పూరము అంటే నాకు "ఉప్పుకప్పురంబు నొక్కపోలికనుండు, చూడచూడరుచుల జాడవేరు, పురుషులందు పుణ్యపురుషులు వేరయా" అన్న వేమన పద్యమే గుర్తుకు వస్తుంది. నిజమే కదా! ఉప్పు కర్పూరము ఒక్కలాగానే ఉంటాయి. వాసన తేడా! రుచి తేడా! ఉప్పు వేడికి చిటపటలాడుతుంది. కర్పూరం కరిగిపోతుంది. మరి మనుష్యులలో తేడా కనిపెట్టడం చాలా కష్టం. అందరూ ఒక్కమాదిరిగానే ఉంటారు. మంచివారిని వెన్నంటి ఉండే దేవదూతలు కనిపించరు. చెడ్డవారికి కొమ్ములవంటివి ఏమీ కనిపించవు. సినిమాలలో చూపినట్లు చెడ్డవారు నల్ల దుస్తులు, మంచివారు తెల్ల దుస్తులు ధరించరు. మరి ఎలా? యద్భావం తద్భవతి! మనం అవతలి వ్యక్తిలోని లోపాలనే చూద్దామనుకుంటే 'రామా' అన్నా, 'రామ్మా!' అని లాలనగా పిలిచినా తప్పుగానే పరిణమిస్తుంది. అదే అవతలివ్యక్తి మనకి అత్యంత ప్రీతిపాత్రుడైనచో వారి వ్యంగపు మాటలుకూడా మనకి ఆనందాన్నిస్తాయి.

ఒక పార్టీ జరుగుతోంది. ఒకావిడ ఇంటి పని చేసుకుంటూ, "ఒక్కసారి ఇలా రారా, ఈ మూట చాలా బరువుగా ఉంది. అటు జరపరా!" అని అడిగింది. ఇప్పుడు ఆ వ్యక్తి ఆమెపై సదభిప్రాయము లేకపోతే, "ఏమిటి? ఈవిడ నామీద ఏకవచన ప్రయోగం చేస్తోంది?" అనుకోవచ్చు. అదే 'రారా' అన్నది 'రండి' అనేదానికి పర్యాయ పదంగా వాడినట్లు, 'జరపరా' అనేదానిని 'జరపండి' అనేదానికి పర్యాయపదంగా వాడినట్లు అర్థం చేసుకోగలిగితే చింతలేదు. బాగా డబ్బున్నవాళ్ళు పరిస్థితుల ప్రభావం వల్ల ధనాన్ని కోల్పోతే, "ఆస్తి అంతా హారతి కర్పూరంలా హరించుకు పోయింది." అనడం పరిపాటి. హారతికి కర్పూరాన్నే ఎందుకు ఉపయోగిస్తారు? కర్పూరము కరిగి, తరిగి, ఇగిరి, చివరికి హరించుకుపోతుంది. దీనిభావమేమి ధీవరేణ్యా? అంటే - హారతి ఇచ్చేది పూజ చివరిలో, పూజ అంతా సక్రమముగా చేసినపుడు, హారతి ఇచ్చే సమయానికి ఆ వ్యక్తి హృదయము కరుణతో కరిగి ఆర్ద్రమౌతుంది. అహంభావం తరిగి, అహంకారం ఇగిరి, చివరకు ఆత్మతత్వం తెలిసి - అజ్ఞానం హరించిపోతుంది.

కర్పూర హారతి ఇచ్చేటప్పుడు ఒక విషయం అర్థమవుతుంది. కర్పూరం ఘనపదార్థముగా ఉన్నప్పుడు - 'నేను', 'నాది' అనే అహంకారముతో చరించే మానవుడిలా ఉంటుంది. కాని ఒకసారి గురువు కృప కలిగి, అజ్ఞాన అంధకారం తొలగి, జ్ఞానమనే వెలుగును పొందినట్లైతే, ఆ కర్పూరం కరిగి వాయుస్థితిని పొందినట్లే, తాను ఈ శరీరము మాత్రమే కాదని, దానికి అతీతమైన ఆత్మ స్వరూపుడనని తెలుసుకోవడం జరుగుతుంది. *